# 103. విమర్శ

తన ముగ్గురు కొడుకులు ఇతరుల మీద అధికంగా విమర్శలని చేయడం ఓ రాజుగారు గమనించాడు. పూర్తి వివరాలని తెలుసుకోకుండా వారు అలా విమర్శించడం ఆయనకి నచ్చలేదు. వారిని సరిదిద్దాలనుకుని ఆయన తన ముగ్గురు కొడుకులని పిలిచి చెప్పాడు.

"మన దేశానికి ఉత్తర దిక్కున ఓ పెద్ద జామ వృక్షం ఉంది. మీరు ముగ్గురూ వెళ్ళి దాన్ని చూసి వచ్చి అది ఎలా ఉందో నేనడిగినప్పుడు చెప్పండి."

పెద్ద కొడుకు వెంటనే, రెండో కొడుకు రెండు నెలలు ఆగి, మూడో కొడుకు మూడు నెలలు ఆగి ఉత్తర దిక్కుకి ప్రయాణం అయి ఆ జామ చెట్టుని చూసివచ్చారు. పెద్ద కొడుకు వేసవిలో, రెండో కొడుకు వర్షాకాలంలో, మూడో కొడుకు చలికాలంలో ఆ చెట్టుని చూసి వచ్చారు.

ఏడాది తర్వాత రాజుగారు ముగ్గురు కొడుకులని పిలిచి, ముగ్గురినీ అడిగాడు.

"మీరు చూసిన జామ చెట్టు ఎలా ఉందో చెప్పండి."

"అది ఎండిపోయి ఆకులు రాలి మరణించడానికి సిద్ధంగా ఉంది." వేసవిలో దాన్ని చూసిన మొదటి కొడుకు చెప్పాడు.

"కానే కాదు. అది పచ్చగా కళ కళలాడుతూ పెద్ద పెద్ద పండిన పళ్ళతో, వాటి కోసం వచ్చే రంగురంగుల చిలుకలు, పిట్టలతో ఎంతో సౌందర్యవంతంగా ఉంది." రెండో కొడుకు చెప్పాడు.

"అన్నలిద్దరూ చెప్పింది తప్పు. ఆ చెట్టు ఆకులన్నీ రాలిపోయి బోసిగా, కళావిహీనంగా ఉంది." చెప్పాడు మూడో కొడుకు.

వాళ్ళ మాటలు విన్న రాజుగారు వాళ్ళతో చెప్పాడు.

"మీ ముగ్గురూ చెప్పింది నిజమే. కాని మీరు ఆ జామ చెట్టుని మూడు కాలాల్లో చూడకుండా దాని ఓ భాగం అయిన కాలంలో చూడటం వల్లే మిగిలిన ఇద్దరు చెప్పేది తప్పు అనుకున్నారు. అన్ని కాలాల్లో చూసాకే ఓ చెట్టు నిజ

స్వభావం ఎలా అర్థమవుతుందో అలాగే మనిషి స్వభావాన్ని నిర్ణయించడానికి అతని జీవితం మొత్తం తీసుకోవాలి తప్ప ఎప్పుడో ఓ క్షణంలో చేసే చిన్న తప్పునో, చిన్న మాటనో పట్టుకుని అతనిలాంటి వాడు అని నిర్ధారణకి రాకూడదు."

తండ్రి బోధని అర్థం చేసుకున్న ఆ ముగ్గురు కొడుకులూ అటు తర్వాత సాటి మనుషుల్ని విమర్శించడం మానుకున్నారు.

## 104. స్వర్గానికి అర్హత

ఓ కారు ఏక్సిడెంట్‌లో ఓ మనిషి, అతని పెంపుడు కుక్క మరణించడంతో ఇద్దరూ పైకి వెళ్ళారు.

'స్వర్గం' అన్న అక్షరాలున్న బంగారు రంగు బోర్డు ఓ ద్వారం ముందు అతని కంట పడింది. అతను దాంట్లోకి వెళ్తూంటే ద్వార పాలకుడు ఆపి అడిగాడు.

"స్వర్గంలోకి కుక్కలని అనుమతించం. కావాలంటే నువ్వు ఒంటరిగా వెళ్ళచ్చు."

"ఇది పుట్టినప్పటి నించి నాదగ్గరే పెరుగుతోంది. దీన్ని వదలలేను." అతను ఇష్టపడక చెప్పాడు.

"అయితే నీకు స్వర్గంలోకి ప్రవేశం లేదు."

ఎదురుగా అతను ఇంకో ద్వారం మీద 'నరకం' అని రాసి వుండటం గమనించి తన కుక్కతో అటువైపు నడిచాడు. అక్కడి ద్వార పాలకులు కుక్కతో అతను లోపలికి వెళ్ళడానికి ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. లోపల సుందర వనాలు, అప్సరసా స్త్రీలు, బంగారు భవంతులు అతనికి కనిపించాయి.

"నరకం ఇంత వైభోగంగా వుంటుందని నేను ఎన్నడూ అనుకోలేదు." అక్కడున్న వారిలో ఒకరితో అతను ఆశ్చర్యంగా చెప్పాడు.

"ఇది నరకం అని ఎవరన్నారు? స్వర్గం." జవాబు చెప్పాడతను.

"మరి స్వర్గం అన్న బోర్డు ఎదుటి ద్వారం దగ్గర వుందిగా?"

"అది నరకం. తనతో వచ్చినవాళ్ళని తన స్వార్థం కోసం వదిలేసేవాళ్ళెవరో కనిపెట్టడానికి బోర్డులని అలా తారుమారుగా పెట్టారు." వివరించాడతను.